# గోదారమ్మ-16

"సీత గతం గురించి నాకనవసరం... సీత ప్రస్తుతమే నాక్కావల్సింది. ఈవూళ్ళో తను ఎలా ఉంటుందో అదే నేను పట్టించుకుంటాను, సీత గురించి గోదారమ్మగారు చాలా బాగా చెప్పారు. ఆవిడంటేనూ, ఆవిడ మాట మీదనూ నాకు చాలా గురి ఉంది! అదే నమ్ముతాను! ఇంకో మాట చెప్పమంటారా... ఆవిడ చెప్పినందువల్లేకాదు, సీత అంటే కూడా నాకు చాలా ప్రేమ, ఆరాధన...ఎప్పటినుంచో. నాతో పెళ్ళికి తను ఒప్పుకోవటమే అదృష్టంగా అనుకుంటున్నా. అలాంటిది కాదని నేను చెప్పడమా...?? అలా ఎప్పటికీ జరగదు! అసలు పెళ్ళే చేసుకోకూడదని నిర్ణయించుకున్న నేను... సీతతో పెళ్ళి అంటే... ఒక వరం అనుకుని, చాలా ఆనందిస్తున్నాను!"

ఆ మాటలకు పద్మనాభంగారు నచ్చచెబుతున్నట్లుగా మళ్ళీ చెప్పారట...'నా కెందుకోగానీ ఆ అమ్మాయిని చూస్తే సదభిప్రాయం కలగటం లేదయ్యా! ఆవిడ ను... అంటే గోదారమ్మ ను పెద్దమ్మ అంటూ ఇంట్లో పెట్టుకుంది. ఆవిడ దగ్గర చాలా మంచిదానిలా వేషాలు వేస్తూ... ఆవిడనో గదిలో మూల కూర్చోబెట్టి టింగురంగా వేషాలు వేస్తూంటుంది. నా మాట నమ్ము. నీకు తగిన మంచి పిల్లను చూసి నేను పెళ్ళి చేస్తానని అంటున్నాగా..?'

అలా పద్మనాభంగారు ఎన్నిసార్లు హెచ్చరించినా రామచంద్రం చెవిన పెట్టలేదట. పైగా 'ఎంత అందమైన మంచి అమ్మాయైనా నాకవసరం లేదండీ. సీతపట్ల లగ్నమైన నా మనసు ఇక మారదండీ' అని ఖచ్చితంగా రామచంద్ర చెప్పేసరికి చేసేదేంలేక ఆయనా మిన్నకుండిపోయారట.

ఇదంతా ఆయన కళ్ళనీళ్ళతో చెప్పి 'సీతా... నిన్ను చూస్తే నాకెందుకో అకారణంగా అసూయా ద్వేషాలు ఏర్పడి... నీకు సుఖశాంతులు లేకుండా చేయాలనుకున్నాను. బహుశా నీకు ఇల్లు దక్కకుండా చేయాలనే నా ప్రయత్నం బెడిసి కొట్టినందువల్లే కావచ్చు! ఆపైన ఊరు వాళ్ళంతా నీ గురించీ, నీ మంచితనం గురించీ పదేపదే మెచ్చుకోవటమూ నాకు నచ్చలేదనుకుంటాను. ఈర్ష కలిగించి వుంటుంది. అందుకే కోపంతో రగిలిపోయా. నీ పెళ్ళి చెడగొట్టి కీడు చేయాలనుకున్నా. కానీ ఇపుడు... నువ్వే నాకు, నా కుటుంబానికీ ఆసరా అయ్యావు! మా ఆవిడ ప్రతీరోజూ 'ఆ సీత ఆసరాగా వచ్చి పనుల్లో చేయందిస్తోంటే... నా ప్రాణానికి ఎంత తెరిపిగా ఉందో... అలాంటి మంచి అమ్మాయిని జీవితంలో చూడలేనేమో...!' అంటూ నిన్ను తలుచుకుని మురిసిపోతోంటే, నేను సిగ్గుతో కుమిలిపోతున్నా...!' అంటూ బాధపడ్డారు.

అమ్మా...అప్పుడు నేనే ఆయన్ను ఓదార్చాల్సి వచ్చింది. " నాగురించి ఏమీ తెలియనపుడు ఏదో అనుకున్నారు. దీని గురించి మీరింతగా చింతించాల్సిన పనిలేదండీ! ఈ ఊరువాళ్ళంతా నా స్వంత మనుష్యులు... కుటుంబ సభ్యులుగా భావించి నే చేయగలిగినంది చేయాలనిపిస్తుంది! నన్నూ మీ ఇంట్లో మనిషిగా భావించి, మీ మనసులోని మాటను నిజాయితీగా చెప్పారు. దానికే నాకు చాలా సంతోషంగా ఉందండీ!" అన్నా.

ఇదమ్మా జరిగిన సంగతి! మీరు నా గురించి అలా చెప్పారు అని విన్నపుడు, నాకు చాలా ఆనందంగా అనిపించింది!

అమ్మా... మీ వల్లే రామచంద్రలాంటి మంచి మనిషి నాకు భర్తగా దొరికాడు! ఆ సాధ్వి సీతాదేవి శ్రీరామచంద్రుడు భర్తగా లభించినందుకు తన అదృష్టానికి ఎంతగా ఆనందించివుంటుందో నిజంగా తెలియదుగానీ, నేను మాత్రం అంతకు రెట్టింపుగా  రామచంద్ర నాకు జతగా కుదిరినందుకు సంతోషపడుతున్నానమ్మా! ఇదంతా మీ వల్లే కదూ అని మీకు పదేపదే కృతజ్ఞతలు చెప్పాలనిపిస్తోంది!''

సీత మాటలకు గోదారమ్మ చిరునవ్వుతో చూసి చెప్పింది. ''సీతా... నువ్వు పద్మనాభంగారింటికి వెళ్తానని చెప్పినపుడే అనుకున్నాను. 'అపకారికి ఉపకారం చేయుట' నీలాంటి వాళ్ళకి తప్పితే మరింకెవ్వరికీ చేతకాదని! కొన్ని విషయాల్లో మనిద్దరం ఒకేరకంగా ప్రవర్తిస్తుంటాం! మనిద్దరం చేయీచేయీ పట్టుకుని ఒకే మార్గంలో సాగుతున్నామనిపిస్తూ ఉంటుంది నాకు!''

ఆవిడను ఆ మాటలకు అర్థం విడమరచి చెప్పమని అడుగుదామనుకునీ సీత అడగకుండా మిన్నకుండిపోయింది.

సందర్భాన్ని బట్టి ఆవిడే చెబుతారులే  అనుకుంది.

గోదారమ్మ చిరునవ్వుతో 'వెళ్ళి నీ పనులు చూసుకో' అన్నట్లుగా చూసేసరికి సీత అక్కడనుండి లేచి లోపలకు వెళ్ళిపోయింది.

* * *

"అమ్మా... చూడండీ... రామచంద్ర ఏమంటున్నాడో...!'' సీత గోదారమ్మతో ఫిర్యాదు చేస్తున్నట్లుగా అంది.

'ఏమిటీ' అన్నట్లుగా చూసిందావిడ.

''నాకు... ఏ పనులూ రావట... అన్నీ తనే నేర్పిస్తున్నాను అంటున్నాడు. మీరు చెప్పండి... నిజంగా నాకేమీ రావా...?'' బుంగమూతి పెట్టి అడిగింది సీత.

సీత వెనకే వచ్చిన రామచంద్రని చూసి గోదారమ్మ ఇద్దరివైపూ నవ్వుతూ చూసింది.

"సీతకు వంట రాకపోవటం ఏమిటి రామచంద్రా... వంటే కాదు, అన్ని పనులూ చక్కగా చేస్తుందిగా...!" అంది.

సీత రామచంద్రవైపు అల్లరిగా చూసింది.. "నే చెప్పానా... అమ్మ  ఈ మాటే అంటారని... నాకు తెలుసు! నీ సంగతే సరిగా తెలియదుగానీ... నా విషయాలన్నీ బాగా తెలుసు...!" నవ్వుతూ అంది సీత.

"రామచంద్ర గురించి మాత్రం నాకు బాగా తెలియదని ఎందుకు అనుకుంటున్నావు సీతా... నేనిక్కడకు వచ్చాక రామచంద్రని దగ్గరగా గమనించాకనే, తన గురించి అన్ని విషయాలూ క్షుణ్ణంగా తెలుసుకున్నాకనే కదా, మనింటికి భోజనానికి పిలిచానా...! అపుడే నాకో అభిప్రాయం ఏర్పడింది. మీ ఇద్దరూ ఒకరికొకరు సరిగ్గా సరిపోతారని అనుకుని... పరిచయం ఏర్పడినాక పెళ్ళి విషయం కదుపుదామని అనుకున్నాను. నేననుకున్నట్లే జరిగింది...!"

ఆవిడ మాటల్ని విన్న రామచంద్ర సీత వైపు ఒక చూపు విసిరి "ఇపుడు నీకూ తెలిసిందిగా, నన్ను అన్ని విధాలా పరీక్షగా చూసాకనే నా గురించి ఓ అభిప్రాయానికి వచ్చారట!" నవ్వు మొహంతో అని రామచంద్ర లోపలకు వెళ్ళిపోయాడు.

సీత గోదారమ్మతో ఒక క్షణం తర్వాత కొంచెంగా తలవంచుకుని అంది.. ''నిన్న రామచంద్ర గురించి గొప్పగా తలుచుకుని, ఇంతలోనే మళ్ళీ నేరం మోపుతున్నానని నవ్వుకుంటున్నారా...?''

కాదన్నట్లుగా ఆవిడ తలవూపింది.

''లేదమ్మా... ఇలాంటి చిన్న చిన్న కలహాలు లేని కాపురం ఉండనే ఉండదు. ఇలాంటి చిలిపి తగాదాలే బంధాన్ని మరింత బిగదీస్తాయి! సంసారంలో మాధుర్యాన్నీ పెంచుతాయని నాకూ తెలుసుగా...!'' అందావిడ చిన్నగా నవ్వి.

''సీతా... నీకో విషయం చెప్పనా...'' అంటూండగానే, కుముద, రంగా ఇద్దరూ పరిగెత్తుకుని వచ్చారక్కడికి.

గోదారమ్మతో కుముద ''చూడమ్మమ్మా... రంగా నాకు అమ్మలేదని అంటున్నాడు.'' అని ఫిర్యాదు చేస్తూ సీతను చూపించి ''నీకు పిన్ని మాత్రమే అంటున్నాడు. పిన్ని తనకు మాత్రమే అమ్మ అట...!'' అంది.

గోదారమ్మ రంగాని ''అలా అన్నావా... ఎందుకూ...?'' అనడిగింది.

''నిజమేకదా... మా స్కూలు పిల్లలూ అన్నారు. మన వూళ్లో వాళ్ళు మరికొంతమందీ నాతో చెప్పారూ...!'' అని రంగా జవాబు చెప్పాడు.

గోదారమ్మ కుముదని దగ్గరకు తీసుకుని ''నీకు రామచంద్ర, సీత పిన్నీ బాబాయ్ లు కాదు, ఇక నుంచీ అమ్మా, నాన్నలే...! వాళ్ళూ వీళ్ళూ చెప్పినవి సరికాదు. నిన్ను ఇద్దరూ అమ్మా నాన్నల్లా ప్రేమగా చూస్తున్నారా, లేదా అన్నది నీకు తెలుసుగా. మరింకెందుకూ, ఎవరో ఏదో అంటే నమ్మటం...?'' అనగానే కుముద ఆనందంగా ''అయితే పిన్నిని... నేనూ రంగాలాగ 'అమ్మా' అని పిలవ్వొచ్చా...?'' అంది.

సీత వెంటనే కుముదను దగ్గరకు తీసుకుని ఒళ్ళో కూర్చోబెట్టుకుని ''తప్పకుండా అలాగే పిలువు కుముదా...'' అంది.

ఆ మాట అంటున్నపుడు సీత కళ్ళు చెమరించటం గోదారమ్మ గమనించింది.

గోదారమ్మ కుముదతో ''పెద్దవాళ్ళు ఏది చెబితే, అది చక్కగా వింటావు. నువ్వు బంగారు తల్లివి...!'' అంది లాలనగా చూస్తూ.

రంగా గోదారమ్మతో ''మరి... నేను...?'' అనడిగాడు బుంగమూతిపెట్టి. ఆవిడ సరదాగా నవ్వేసింది.

''నువ్వా... బంగారు కొండవే! అక్కని ఎంత ప్రేమగా, అభిమానంగా చూస్తావోకదా, కుముద చెప్పిన మాటలన్నీ చక్కగా విని అలాగే చేస్తావు. మీరిద్దరూ ఎప్పటికీ ఇలానే ఉండాలి! అంతా మనం అనుకోవటంలోనే ఉంది! మీరిద్దరూ అక్కా, తమ్ముడు కాదని ఎవరు అన్నా నమ్మకేం. 'మాకు తెలుసులే' అని జవాబు చెప్పి నవ్వేసి వూరుకోండి. అపుడు వాళ్ళకే అర్థమౌతుంది...!''

ఆ మాటలకు రంగా మొహమూ ఆనందంతో వికసించింది!

సీత ఇద్దరికీ ముద్దులు పెట్టి ''మీరిద్దరూ బంగారాలే! చక్కగా వెళ్ళి ఆడుకోండి...'' అని పంపించేసింది.

ఇద్దరూ బయటకు పరుగుపెట్టారు.

సీత గోదారమ్మతో ''ఇందాక... మీరేదో చెప్పబోయారు...?'' అంటూ గుర్తుచేసింది.

''ఏంలేదు సీతా... నీ మాటలు విన్నపుడు, మీ సరదా సరదా అలకలు చూసినప్పుడు, నాకు నా జీవితంలోని ఓ సంఘటన గుర్తువచ్చింది... నేనూ వైవాహిక జీవితాన్ని ఆనందంగా అనుభవించినదానినేగా! మా అత్తగారికి మాత్రం నేను వాళ్ళింటికి కోడలుగా రావటం అంతగా ఇష్టం లేదని అనుకున్నాను.

గారంగా ఒక్కతే అమ్మాయిగా పెరిగిన నేను, వాళ్ళింట్లో ఉమ్మడి కుటుంబంలో భాద్యత గల పెద్దకోడలుగా ఇమడలేనని ఆవిడ ఉద్దేశ్యం అనుకుంటా! కానీ... మామగారూ, ఆయనా ఇష్టం చూపించటం వలన తన వ్యతిరేకతను చెప్పలేదనుకుంటా. తప్పక ఆవిడా రాజీపడ్డారు కాబోలు!

కానీ... నేను వచ్చాక ఆవిడతో పాటూ ఉదయమే లేచి పనులు పురమాయించటం... అన్నీ సవ్యంగా జరిగేట్లుగా చూడటం... ఇలా..అన్ని పనుల్లోనూ జోక్యం చేసుకుంటూండేసరికి ఆవిడ కొంత అపనమ్మకంగా, ఆశ్చర్యంగా నావేపు చూస్తుండటాన్ని బట్టి నాకీ విషయం తెలిసిందన్నమాట!

ఒకసారి నేనేదో చేస్తుంటే... ఆవిడ 'అలాకాదు' అంటూ ఏదో చెప్పబోతుంటే, ఆవిడ మీద ఏర్పడిన అభిప్రాయంతో అసహనం వచ్చేసి ''నాకేదీ సరిగా చేయటం రాదని మీ ఉద్దేశ్యం కదూ ? నాకు తెలుసు...'' అంటూ విసురుగా ఆ పని వదిలేసి నా గదిలోకి వచ్చి మంచమెక్కాను.

అపుడే అక్కడకు వచ్చిన ఆయన 'ఒంట్లో బాగాలేదా...?' అనడిగితే ఇంకా చిరాకు వచ్చింది.

'మీ అమ్మగారికి ఇష్టమైనట్లుగా మీరు బాగా పనిపాటలు వచ్చిన అమ్మాయిని చేసుకుని ఉండాల్సింది... నన్ను ఇబ్బంది పెట్టటానికి కాకుంటే... ఇలా ఎందుకు చేసారూ..?' అంటూ కోపం చూపించాను.

ఆయనకు నా మాటలు అర్థంకాకనో, ఏమో ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోయారు కాసేపు. తర్వాత కాసేపటికి భోజనానికి రమ్మని పిలుపు వచ్చింది.

'నాకు బావుండలేదని, తిననని' ఖచ్చితంగా చెప్పేసాను.

కాసేపటి తర్వాత ఆయన వచ్చి అనునయంగా అడిగారు ''ఎప్పుడూ వినయంగా ఉండే అమ్మాయి అంత చిరాకు పడినపుడే పాపం ఒంట్లో బాగాలేదేమోనని నాకు అనుమానం వచ్చింది. డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళి చూపించు..అని అమ్మ చెప్పింది. అమ్మ కూడా భోజనం చేయకుండా దిగులుగా ఉంది'' అని ఆయన చెప్పగానే నా కోపం ఆవిరి అయిపోయింది.

''నిజంగానా...?'' అనడిగా.

నిజమేన్నట్లుగా తలవూపారు.

నేను ఇంకేం మాట్లాడకుండా రివ్వున అత్తయ్య దగ్గరకు వెళ్ళాను. నన్ను చూస్తూనే ఆప్యాయంగా 'ఎలా ఉందమ్మా...?' అనడిగేసరికి నేను చిరునవ్వుతో 'బాగానే ఉంది. ఏదో కొంచెం అసహనంగా అనిపించిందంతే, పదండి... ఇద్దరమూ భోజనం చేద్దాం...!' అన్నాను.

ఆవిడా హుషారుగా లేచి నా చేయి పట్టుకుని చూసి గట్టిగా నిట్టూర్చారు.

''ఎపుడూ లేనిది... నువ్వలా కొంచెం చిరాకుగా మాట్లాడితే, నాకు చాలా కంగారొచ్చేసింది! ఎంతో గారంగా పెరిగినా, ఇక్కడ అన్ని పనుల్లోకీ జొరపడుతూ, అందరు పనివాళ్ళనీ అజమాయిషీ చేస్తూ, అందరికీ అన్నీ సవ్యంగా జరిగేట్లుగా చూస్తున్నావు! నాకెంతగా ఆసరాగా ఉంటున్నావో అని ఎంత సంతోషిస్తున్నానో తెలుసా...?'' అన్నారు.

నామీద ఆవిడకు అలాంటి అభిప్రాయం ఏర్పడిందని ఊహించని నేను నివ్వెరపోయాను!

ఆరోజు... నా గురించి అంత మంచి మాటల్ని అత్తగారి నోటివెంట వినటంతో నాకెంతో విజయగర్వం కలిగింది!

ఒక్కోసారి చిన్న చిన్న అలకలూ, కోపాలూ మనమీద ఎదుటి వాళ్ళకున్న అభిప్రాయాన్ని వెల్లడిచేస్తాయేమో అనుకున్నాను! అలా నేనూ..మా అత్తగారూ ఆ తర్వాత చాలా మంచి స్నేహితులమైపోయాం.''

గోదారమ్మ కాసేపు నిశ్శబ్దంగా ఉండిపోతే సీత ''తర్వాత ఏమయిందమ్మా...?'' అనడిగింది.

ఆవిడ నిట్టూర్చి ''ఏముందీ, తర్వాత రోజులన్నీ చకచకా గడిచిపోయాయి. మా మరదులు అందరూ పెళ్ళిళ్ళూ చేసుకుని వెళ్ళిపోయారు! ఎవరి జీవితాలు వాళ్ళవిగా అయిపోయాయి. మా మామగారు అందరికీ ఆస్తులు పంచి ఇచ్చేశారు. అందరూ పంచుకునేటప్పటికి మాకు వచ్చింది తక్కువే. ఎవరికి వారుగా ఏం చేయాలో నిర్ణయించుకోండి... అది మీ ఇష్టమే'' అని మామగారు తేల్చి చెప్పటం జరిగింది.

ఇక దగ్గర్లోని ఒక వూరులో ఆయన ఉద్యోగం సంపాదించి, అక్కడకు మా ఇద్దరు పిల్లలతో మకాం మార్చేశాం.

అలా ఆ వూళ్ళో కొన్నాళ్ళు ఉన్నాం.

అంత పెద్ద ఉమ్మడి కుటుంబంలో అన్ని పనులూ నిభాయించుకోగలిగిన నాకు ఈ ఒంటరి కాపురం చాలా తీరుబడిగా అనిపించేది. వంటా, వడ్డనా అన్నీ తొందరగా పూర్తి అయ్యేవి, ఇక సాయంకాలం వరకూ ఖాళీగా ఉండేదాన్ని. ఇరుగూ పొరుగుతో కాలక్షేపం కబుర్లు చెప్పుకోవటం జరిగేది! ఇక ఇంట్లోకి, వంటకి కావలిసిన కూరగాయలూ అన్నీ నేనే ఒంటరిగానో లేక పక్కింటి వాళ్ళతోనో కలిసి వెళ్ళి తెచ్చుకునే దాన్ని! అలా అన్ని పనులూ నేనే చక్కబెట్టుకోవటమూ బావుండేది! పనివాళ్ళతో చేయించుకోవటమూ, స్వయంగా చేసుకోవటమూ... ఇలా రెండు దశలూ నేను అనుభవించానన్నమాట!'' అంటూ గోదారమ్మ నిట్టూర్చి మౌనంగా ఉండిపోయేసరికి సీత ''తర్వాత...?'' అని ప్రశ్నించింది.

''ఇక తర్వాత ఏముందీ, అలా రోజులు జరిగిపోయాయి. పెద్దవాళ్ళు అంతా అమ్మ నాన్నలు, అత్త, మామయ్యలూ అందరూ దేముడి దగ్గరకు వెళ్ళిపోవటం జరిగింది...!'' అంటూ భారంగా నిట్టూర్చి ''సీతా... నువ్వు 'తర్వాత'... అంటూ మళ్ళీ అడగాల్సిన పనిలేదు! ఒక ఆదివారం... ఇంట్లో మనమిద్దరమే ఉన్నపుడు తర్వాత విషయాలు క్లుప్తంగా చెప్పుకుందాం! సరేనా...?'' అందావిడ ముగింపుగా.

* * *

ఒక ఆదివారం సీత గోదారమ్మ దగ్గరకు వచ్చి పక్కన కూర్చుంటూ అంది ''అమ్మా... రామచంద్ర బయటకు ఏదో పనిమీద వెళ్ళారు. పిల్లలు ఆడుకోవటానికి వెళ్ళారు. ఇంట్లో మనమిద్దరమే ఉన్నాం...!'' అంది.

ఆ మాటతో సీత ఉద్దేశ్యం ఏమిటో ఆవిడకు అర్థమైంది. అయినా ఆవిడ 'అయితే ఏమిటి' అన్నట్లుగా సీత వైపు చూసింది.

సీత చిరునవ్వుతో ''అదేనమ్మా... మీరీ వూరుకు ఒంటరిగా రావటానికి కారణం ఏమిటో చెబుతారనీ...'' అంటూ మాటలు ఆపేసింది.